

గజ, హనుమంతు వాహనాలపై ఊరేగుతున్న మలయప్పస్వామి

సాయంత్రం... స్వర్ణ రథంలో దేవేరులతో కలిసి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

బంగారు రథమెక్కి భగవంతుడొచ్చాడు!

అదిగో చూడరో.. అందరు మొక్కరో!

బ్రహ్మోత్సవాల ఆరవ రోజు సాయంత్రం బంగారు రథంపై తిరుమల స్వామి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించాడు. ఉభయ దేవేరుల సరసన శ్రీవారి చిద్విలాస యాత్ర వేలాది మంది భక్తుల గోవిందల నడుమ వైభవంగా సాగింది. ఉదయం హనుమంతుడే స్వామికి వాహనంగా మారాడు. బంగారు విల్లు ధరించి శ్రీరాముడి అవతారంలో శ్రీనివాసుడు ఊరేగాడు. రాత్రి గజవాహనసేవకూ భక్తులు పోటెత్తారు. వెంకన్న స్వామికి అంకితమైన ఆలయ గజాలు లక్ష్మి, మహాలక్ష్మి, పద్మజ, పద్మావతి ముందు నడవగా గజవాహనం మాడవీధుల్లో కదిలింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిసా రాష్ట్రాల నుంచి వచ్చిన 18 కళాబృందాల నృత్యగానాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



'కొండ'ంత భక్తజనం

తిరుమలలో ఐదేళ్ల తర్వాత అసలైన గరుడోత్సవ రద్దీ కనిపించింది. 'కొండ'పై ఎటు చూసినా భక్తజనమే కనిపించారు. ఈ రద్దీని ఊహించిన టీటీడీ ఉన్నతాధికారులు ముందస్తు ప్రణాళికతో పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఫలితం.. మంగళవారం నాటి గరుడోత్సవం విజయవంతంగా ముగిసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

- ఐదేళ్ల తర్వాత గరుడ సేవకు భారీ రద్దీ
- 2.7 లక్షలమందికి వాహన దర్శనం
- టీటీడీ ముందస్తు ప్రణాళిక, పటిష్ఠ చర్యలతో విజయవంతం

శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజుల్లో గరుడ వాహనానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరవడం పరిపాటి. 2019 బ్రహ్మోత్సవాలలో గరుడసేవకు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఇక, కొవిడ్ నేపథ్యంలో 2020, 2021లో బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహించారు. 2022లోనూ కొవిడ్ భయంతో చాలా మంది వాహనసేవలకు దూరంగానే ఉన్నారు. గతేడాది ఎన్నికల ముందు కావడంతో పాటు వైసీపీ ప్రభుత్వం వీఐపీలకే ప్రాధాన్యం కల్పిస్తోందనే అభిప్రాయాలతో రద్దీ సాధారణంగానే కనిపించింది. ఈ ఏడాది ప్రభుత్వం మారాక భక్తులు భారీగా వచ్చే అవకాశాలున్నాయన్న అంచనాతో టీటీడీ పటిష్ఠ ఏర్పాట్లు.. తదనుగుణంగా సౌకర్యాలు కల్పించి విస్తృతంగా ప్రచారం చేసింది. దీంతో ఈఏడాది గరుడోత్సవానికి భక్తులు భారీగా వచ్చారు. దాదాపు 2.70 లక్షల మందికి గరుడ వాహనంపై ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. వీరిలో రెండు లక్షల మంది వరకు గ్యాలరీల్లో ఉండి.. సకల సౌకర్యాలతో దర్శనం చేసుకున్నారు. మాడవీధుల్లోని కార్నర్ పాయింట్లలో క్యూలైన్ల ద్వారా మరో 40 వేల మంది.. ఆలయం ముందు రీఫిల్లింగ్ ద్వారా మరో 30 వేల మందికి దర్శనం చేయించగలిగారు. 70 వేలకు పైగా భక్తులు 28 భారీ హెచ్‌డీ డిజిటల్ స్ర్కీన్ల ద్వారా వాహనసేవను వీక్షించారు. ఇక, మూలవిరాట్టును కూడా 82,043 మంది దర్శించుకున్నారు. 3,53,185 లడ్డూలను భక్తులకు విక్రయించారు.

మాడవీధుల్లో సెక్టార్ల వారీగా..

భారీ భక్తజనానికి సమర్థంగా దర్శనం కల్పించడం వెనుక టీటీడీ ముందస్తు ప్రణాళిక ఉంది. మాడవీధుల్లోని 183 గ్యాలరీల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యాల పర్యవేక్షణకు సెక్టార్లవారీగా విభజించి 563 మంది కో-ఆర్డినేటర్లను.. మాడవీధుల్లో మరో 360 మంది సహాయక సిబ్బందిని అందుబాటులో నియమించారు. మరోవైపు తొలిరోజు నుంచీ టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తూ వచ్చారు. గ్యాలరీల్లోని భక్తులను కలిసి వారి ఇబ్బందులు.. టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలు.. ఇంకా ఏం చేస్తే బాగుంటుందనే వివరాలను తెలుసుకున్నారు. ప్రతిరోజు ఉదయం వాహనసేవ పూర్తికాగానే భక్తుల ఫీడ్‌బ్యాక్‌పై అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటూ వచ్చారు. దీనివల్ల గరుడసేవ రోజున గ్యాలరీల్లోని భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తలేదు.

భారీగా బందోబస్తు

గరుడ సేవకు మూడున్నర లక్షల మందికిపైగా తిరుమలకు వచ్చారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రాఘవేంద్రస్వామి మఠం సమీపంలోని క్యూలైన్ల వద్ద జరిగిన తోపులాట మినహా గ్యాలరీల్లోకి ప్రవేశం, నిష్క్రమణ సమయాల్లోనూ ప్రశాంతంగా జరిగింది. వాహనాలను పక్కాగా పార్కింగ్ ప్రదేశాలకు పంపడం.. అదనంగా వచ్చిన వాటిని రింగ్‌రోడ్డులో ఆపేయడంతో తిరుమలలో ట్రాఫిక్ సమస్య ఎదురుకాలేదు. ఇలా డీఐజీ షేముషిబాజ్ పాయ్ ఆధ్వర్యంలో ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ దాదాపు 7 వేల మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమష్టి కృషితో గరుడసేవ విజయవంతం



టీటీడీ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు

టీటీడీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో బ్రహ్మోత్సవాల్లో కీలకమైన గరుడవాహన సేవను విజయవంతంగా నిర్వహించామని ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని రాంభగీచా విశ్రాంతి భవనాల ముందు బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖలు బాగా పనిచేశాయని అభినందించారు. ఆరోగ్య శాఖ మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి బ్రహ్మోత్సవాలను పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండటంతో గ్యాలరీల్లోని భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహన సేవనూ గరుడ సేవలాగే భావించి సేవలు అందించాలని అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. గ్యాలరీల వద్ద మరిన్ని శాశ్వత మరుగుదొడ్లను నిర్మిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం మాడవీధుల్లో మరో వందేళ్లకు సరిపడా మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గరుడ సేవలో క్యాటరింగ్ విభాగం చాలా బాగా పనిచేసిందని అభినందించారు. పోలీసుల సమన్వయంతో విజిలెన్స్ విభాగం పనిచేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసిందన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆకలి అనే మాట వినిపించకుండా

గరుడసేవ కోసం 20 గంటలకుపైగా గ్యాలరీల్లోనే కూర్చున్న భక్తులకు అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందించారు. పాలు, కాఫీ, ఉప్మా, పొంగళి, సాంబారన్నం, టమాటా అన్నం, స్వీట్ పొంగల్, రెండు లక్షల పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం సుండల్, కాఫీ, పాలు.. తర్వాత విజిటబుల్ కిచిడీ ఇచ్చారు. ఇలా 8.70 లక్షల ప్లేట్ల అన్నప్రసాదాలను 4 వేల మంది శ్రీవారిసేవలకు ద్వారా అందించారు. గ్యాలరీల్లోకి రాలేకపోయిన.. మూలవిరాట్టు దర్శనానికి క్యూలో ఉన్న భక్తులకూ అన్నప్రసాదాలు అందజేశారు.

14 నుంచి పల్లె పండుగ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 9: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన వర్చువల్ విధానంలో అధికారులకు పల్లె పండుగపై పలు సూచనలు చేశారు. గ్రామసభల్లో తీర్మానించిన పనులను ప్రారంభించాలన్నారు. సంక్రాంతిలోగా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు.



2212 దరఖాస్తులు.. రూ.44.24 కోట్లు

- మద్యం షాపుల టెండర్లకు రేపటి వరకు గడువు పొడిగింపు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9: జిల్లాలో 227 మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ కాగా.. వీటికోసం తొమ్మిది రోజుల వ్యవధిలో 2212 మంది దరఖాస్తులు సమర్పించారు. లైసెన్సు ఫీజు కింద ఒక్కో దుకాణానికి రూ.రెండు లక్షలు చెల్లించాలి. దీంతో ప్రభుత్వానికి దాదాపు రూ.44.24 కోట్ల ఆదాయం లభించింది. మొదటి షెడ్యూల్ ప్రకారం బుధవారంతో దరఖాస్తుల గడువు ముగిసినా.. ప్రభుత్వం శుక్రవారం వరకు పొడిగించింది. ఈ రెండు రోజుల వ్యవధిలో 300కుపైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

సత్యవేడు నుంచి అంత తక్కువా?

జిల్లాలో మద్యం దుకాణాలకు అనుకున్న రీతిలో దరఖాస్తులు రాకపోవడం వెనుక ఏం జరుగుతోందని రాష్ట్ర స్థాయి అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా సత్యవేడు నియోజకవర్గం నుంచి నుంచి 10 మద్యం దుకాణాలకు గాను ఇప్పటికి 25 దరఖాస్తులే వచ్చాయి. కనీసం దుకాణానికి 8 నుంచి 10 దరఖాస్తులు కూడా రాక పోవడం వెనుక ఏం జరుగుతోందని ఎక్సైజ్ కమిషనరు నిషాంత్‌కుమార్ అడిగినట్లు తెలిసింది. ఇదే విషయమై కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. గతంలో కంటే ఈసారి ఎందుకు అంత తక్కువగా దరఖాస్తులు దాఖలయ్యాయనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట ప్రాంతాల నుంచీ ఇదే పరిస్థితి. దీంతో బుధవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి అక్కడకు వెళ్లి టెండరుదారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన సలహాలు ఇచ్చారు. దీంతో రానున్న రెండు రోజుల్లో ఆ నాలుగు నియోవజకవర్గాల నుంచి ఎన్ని దరఖాస్తులు వస్తాయో చూడాలి.

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ఎస్వీయూకు చోటు

- ఏపీలో మొదటి స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్- 2025లో ఎస్వీయూకు చోటు లభించింది. వీరు 18 అంశాల్లో ఎస్వీయూ ప్రగతిని పరిశీలించారు. బోధనలో 36.2, ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్‌లో 26.3, పారిశ్రామిక అనుసంధానంలో 25.6, అంతర్జాతీయ సంబంధాల్లో 29.2 శాతం మార్కులు సాధించింది. 1201-1500 మధ్య ర్యాంకును ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలన్నింటిలో ఎస్వీయూ మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషితో ఈ గుర్తింపు సాధ్యమైందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు.

పద్మావతి వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9: పద్మావతి మహిళా యూనివర్సిటీలోని పలు కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ ఇంటిగ్రేటెడ్ కోర్సులతో పాటు బీ-ఒకేషనల్ - న్యూట్రీషన్ అండ్ హెల్త్ కేర్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అపెరల్ డిజైన్, బీఏ స్టాటిస్టిక్స్, సోషియల్ వర్క్, ఫైన్ ఆర్ట్స్‌లో పీజీ కోర్సులకు ఆసక్తి గల విద్యార్థుల నుంచీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 9, 10 వ తేదీల్లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పీఆర్వో శ్రీరజని కోరారు. సమగ్ర వివరాల కోసం.. ఎస్‌పీఎంవీవీ.. వెబ్ సైట్ చూడాలని ఆమె ఒక ప్రకటనలో సూచించారు.

ఏర్పేడు ఎస్ఐ రహీంరెడ్డి సస్పెన్షన్



ఎస్ఐ రహీంరెడ్డి

తిరుపతి(నేరవిభాగం)/ఏర్పేడు, అక్టోబరు 9: ఏర్పేడు ఎస్ఐగా 20 రోజుల కిందట బాధ్యతలు చేపట్టిన రహీంరెడ్డి సస్పెండయ్యారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక, మట్టి అక్రమార్కుల నుంచి ఎస్ఐ అవినీతికి పాల్పడ్డారని ఎస్పీకి ఫిర్యాదులు అందాయి. కొత్త వీరాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నాడు. ఇతడిపై చట్టపరంగా చర్యలు తీసుకోకుండా రూ.పది వేలు వసూలు చేసినట్లు.. అలాగే కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వారి నుంచీ నగదు తీసుకున్నట్లు ఎస్పీకి ఫిర్యాదులు వచ్చాయి. ఇలా అనతికాలంలోనే ఆయనపై పలు అవినీతి, అక్రమాలకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో ఎస్పీ స్పందించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తిని విచారణాధికారిగా నియమించారు. విచారణ నివేదిక మేరకు ఎస్ఐ రహీంరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, అక్రమ వసూళ్లను సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. కాగా, రహీంరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు.

గోవిందుడికి 50 కిలోల సెంటు జాజిమాల

● బ్రహ్మోత్సవాల్లో తొలిసారి వినియోగం



సెంటు జాజిమాలలతో సిబ్బంది

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా సెంటు జాజిమాలలను మలయప్ప స్వామికి వినియోగించారు. దాదాపు 50 కిలోల బరువున్న ఈ మాలలో గజవాహనంపై శ్రీవారు సౌందర్యవంతంగా కనిపించారు. అత్యంత సువాసన కలిగిన ఈ సెంటు జాజి కిలో రూ.900 నుంచి రూ.వెయ్యి ధర ఉంది. పిచ్చాటూరు నుంచి ఓ దాత సహకారంతో వీటిని బుధవారం తిరుమలలోని టీటీడీ గార్డెన్ విభాగానికి తీసుకొచ్చారు. సెంటు జాజులు, మధ్యలో కనకాంబరం, చామంతి, పన్నీరాకును వినియోగించి సిబ్బంది మూడు మాలలను తయారు చేశారు. దాదాపు రూ.70 వేల ఖర్చుతో మూడు మాలలను తయారు చేసి ఉత్సవర్లకు అలంకరించారు.

ఆలయ సిబ్బందికి వస్త్రబహుమానం



బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహనం బేరర్లు, మేళం సిబ్బందికి బుధవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వస్త్ర బహుమానం ఇచ్చారు. వైభవోత్సవ మండపంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ చేతుల మీదుగా వస్త్రాలను అందజేశారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో సిబ్బందికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు వస్త్ర బహుమానం అందిస్తున్నట్టు ఈవో చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



అబ్బురపరిచిన కళా బృందాలు



తిరుమల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం, రాత్రి జరిగిన వాహన సేవల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాబృందాలు తమ సంప్రదాయ కళలతో ప్రదర్శనలు ఇచ్చి అబ్బురపరిచాయి. ఉదయం హనుమంత వాహనసేవలో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర కర్ణాటక, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒడిసా, తమిళనాడు నుంచి వచ్చిన 18 బృందాల్లోని 468 మంది కళాకారులు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన విద్యార్థుల భరతనాట్యం, జానకి బృందం కరియా నృత్యం, సురేఖ బృందం మహిషాసురమర్థిని, జ్యోతి హెగ్డే బృందం గీతాగోవిందం, ఇందూ బృందం ఆంజనేయ నమనం, మరాటీ నృత్యం, గోవిందమ్మ బృందం పంజాబీ నృత్యం, ఉమాశంకర్ బృందం బసంతరాస్, గాయత్రీ బృందం శ్రీరామపట్టాభిషేకం, విజయశాంతి బృందం భరతనాట్యం, ధనలక్ష్మి, లీలారాణి, పార్వతి, సుజన, శాలినీరాణి, శ్రీనివాసులు బృందాల కోలాటాల ప్రదర్శనలు నేత్రపర్వంగా సాగాయి.

ఇక, రాత్రి గజవాహనసేవలో 16 బృందాల ద్వారా 408 మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. నీరజ(శ్రీకాకుళం), మౌనిక(వైజాగ్) బృందాల శ్రీకృష్ణలీలలు, భాగవతంలోని దశమ స్కంధం స్ఫురణకు తెచ్చింది. లాలీ బృందం (తిరుపతి) గజేంద్ర మోక్షం, జనకి బృందం (హైదరాబాద్) కైకొట్టికేలి కళారూపం, శాంతిదుర్గా బృందావనం, అల్లం జంపన్న జూమర్ నృత్యం, రవిబొయిదా (మణిపురి) రసలీలా అనే కళారూపాలతో పాటు పలు బృందాలు కోలాటాలు, భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి.























భక్తిభావాన్ని పంచిన భక్తి, సంగీత కార్యక్రమాలు

తిరుమల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నాదనీరాజనం, ఆస్థానమండపం వేదికలపై ప్రదర్శించిన భక్తి, సంగీత కార్యక్రమాలు భక్తిభావాన్ని పంచాయి. ఇందులో.. నాదనీరాజనం వేదికపై ఉదయం 4.30 గంటలకు ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు గణేష్, సాయికుమార్, ఆదర్శ్, నవీన్ బృందం మంగళధ్వని, 5.30 గంటలకు భద్రచలానికి చెందిన కృష్ణమాచార్యులు 'సామానస్య సూక్తం-ఆధర్వణవేదం' అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం 4 గంటలకు వైజాగ్‌కు చెందిన పంతుల రమ బృందం భక్తిసంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌కు చెందిన వాణి బృందం విష్ణు సహస్రనామపారాయణం, 10 గంటలకు తిరుపతికి చెందిన ఉదయభాస్కర్, లావణ్య బృందం భక్తి సంగీతం, 11.30 గంటకు చెన్నైకు చెందిన లక్ష్మీ నరసింహ 'ధర్మో రక్షితి రక్షితః' అనే అంశంపై భక్తిసందేశం అందించారు. సాయంత్రం 4 గంటలకు బాలాజీ, రేవతి బృందం అన్నమయ్య సంకీర్తనలు, 5.30 గంటలకు తిరుపతికి చెందిన వరలక్ష్మి బృందం హరికథ గానం చేశారు.



రాత్రి.. గజ వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు



సాయంత్రం.. స్వర్ణరథాన్ని లాగుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు





ఉదయం.. హనుమంత వాహనంపై మలయప్ప స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు



శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.10 కోట్లు

తిరుమల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.10 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 82,043 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 30,100 మంది తలనీలాలు సమర్పించారు.

మా ఊరికి మద్యం షాపు వద్దు

● జిల్లా అధికారులకు సాయినగర్ గ్రామస్తుల వినతి



డీపీవోకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ డీవీ రమణ, గ్రామస్తులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 9: తమ ఊరికి మద్యం షాపు వద్దంటూ తిరుపతి రూరల్ మండలం సాయినగర్ గ్రామ పంచాయతీ వాసులు జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ, గ్రామస్తులు కలెక్టరేట్‌లో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సుశీలాదేవి, ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, పిల్లలు చాలా ఇబ్బంది పడ్డారని, దీనిపై ఉద్యమాలు చేస్తే తొలగించారని గుర్తు చేశారు. మళ్లీ తమ గ్రామంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదని గ్రామసభలో తీర్మానం చేసి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాసులు, బుజ్జి, అమ్ములు, భారతమ్మ పాల్గొన్నారు.

జగన్ పరివారంతోనే తిరుమల అపవిత్రం:బీజేపీ



జగన్, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి ఫొటోలకు పిండప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ తదితరులు

పుంగనూరు, అక్టోబరు 9: కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూను అపవిత్రం చేశారంటూ మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డి చిత్రపటాలకు బీజేపీ నాయకులు బుధవారం పుంగనూరులో పిండప్రదానం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వంలో టీటీడీ ఛైర్మన్లు, ఈవో క్షమించరాని తప్పులు చేశారని దుయ్యబట్టారు.కమీషన్లకు కక్కుర్తి పడి రూ.322కు కిలో నెయ్యిని సామర్థ్యం లేని డెయిరీ నుంచి కొనుగోలు చేసి కల్తీలకు పాల్పడి ఆరోపించారు.వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని తెలియడంతో పుంగనూరులో జగన్, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి దిష్టి బొమ్మలను గత నెల 22వ తేదీ ఊరేగించి దహనం చేయడం జరిగిందన్నారు.17వ రోజైన బుధవారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, టెంకాయలు కొట్టి, పిండ ప్రదాన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. దేవుడి కొండను అపవిత్రం చేసిన వారి పాపాలకు శిక్ష తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి హరిబాబు, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, మల్లికారాణి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అస్పియా హత్యపై దుష్ప్రచారం : జగన్ పత్రికపై కేసు

పుంగనూరు, అక్టోబరు 9:చిత్తూరు జిల్లా పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి అస్పియా హత్యకు సంబంధించి జగన్ దినపత్రిక, జగన్ టీవీ చానల్‌లో అసత్య ప్రచారం చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు అబ్బాస్ ఫిర్యాదు మేరకు పుంగనూరు పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. అస్పియాపై అత్యాచారం చేసి హత్య చేశారంటూ ప్రచారం చేసిన ఆ పత్రిక, ఛానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అబ్బాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రుయాలో అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స



కోలుకున్న రోగితో రుయా వైద్య బృందం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 9: ఊపిరితిత్తిలో ఇన్‌ఫెక్షన్ చేరి ఆయాసంతోపాటు దగ్గులో రక్తం పడుతున్న మహిళకు అతి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని తిరుపతిలోని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. దీనిపై బుధవారం ఆయన రుయాస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించారు. 'వెంకటగిరికి చెందిన రమణమ్మ(62) తీవ్రమైన ఆయాసం, దగ్గులో రక్తం పడుతూ ఉన్న పరిస్థితిలో రెండు వారాల కిందట రుయాస్పత్రికి వచ్చింది. ఊపిరితిత్తుల విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు ఆమెను పరీక్షించి అరుదైన ఫంగల్ బంతి సమస్య ఉందని గుర్తించారు. అప్పటికే ముదిరి గుండె వరకు వ్యాపించడంతో తక్షణమే శస్త్ర చికిత్స చేసేందుకు ఏర్పాటు చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు కళ్యాణి రమ, రాధ, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స చేసి ఫంగల్ బంతిని తొలగించారు. అనంతరం రోగి పూర్తిగా కోలుకున్నారు' అని వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ క్లిష్టమైన సర్జరీ రుయాస్పత్రిలోనూ విజయవంతంగా చేస్తున్నామన్నారు. నిరుపేద రోగులు ఇక్కడి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొదటిఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు

తిరుమల, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో బుధవారం సాయంత్రం ఓ కారు అదుపుతప్పింది. బెంగళూరుకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. 9వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి ఎడమవైపునున్న చిన్నపాటి గట్టుపైకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది. కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు.

నలుగురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

● 11 దుంగల స్వాధీనం

మంగళం, అక్టోబరు 9: టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 11 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐలు సురేష్‌బాబు, విశ్వనాథ్‌ల బృందం చిత్తూరు సమీపంలోని సంతపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సంతపేట బీట్ పరిధిలో కాజూరు వద్ద అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పట్టుకుని విచారించగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు బయటపడింది. వారి నుంచి 11 ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం ఢిల్లీ పర్యటన రాష్ట్రాభివృద్ధి కోసమే: టీడీపీ



మీడియా సమావేశంలో నరసింహ యాదవ్

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 9: సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన రాష్ట్రాభివృద్ధి కోసమేనని టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం కట్టుబడి ఉన్నారని, ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు కూడా ముందుకు సాగుతున్నాయని అన్నారు. పోలవరం, భోగాపురం ఎయిర్‌పోర్ట్, బీపీసీఎల్ రిఫైనరీ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, విశాఖ ఉక్కు తదితర అంశాలపై చంద్రబాబు కేంద్రంతో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఇది తెలుసుకుని మాట్లాడాలని, లేనిపోని విమర్శలు చేయడం సరికాదని అన్నారు. మాజీ సీఎం జగన్ కేసుల నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీ పర్యటనలు చేస్తారని ఆరోపించారు. గత ప్రభుత్వం పోలవరాన్ని పూర్తి చేస్తామని చెప్పి, నిధులు పక్కదారి పట్టించిందని విమర్శించారు. సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, చెంగయ్య, మనోహరాచారి, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై గాయత్రి దేవిగా ఎల్లమ్మ

చంద్రగిరి, అక్టోబరు 9: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చి పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో గాయత్రిదేవి అలంకరణ చేసి అశ్వవాహనంపై అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయ ఆవరణలోని సంతోషిమాతకు సరస్వతీ సహస్రనామార్చన చేశారు. తొండవాడలోని ఉగ్రప్రత్యింగిరాదేవి ఆలయంలో ఉదయం విశేష పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని సప్తమి దుర్గగా కాళరాత్రి అలంకరణ చేసి, ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. ఆలయ పీఠాధిపతి సూరిస్వామి పాల్గొన్నారు.



ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తిరుచానూరు, అక్టోబరు 9: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని అధిక దిగుబడులు సాధించాలని తిరుపతి రూరల్ మండల వ్యవసాయాధికారిణి మమత రైతులకు సూచించారు. బుధవారం బ్రాహ్మణపట్టు, కొత్తూరు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా వరి నాట్లను పరిశీలించారు. డ్రిప్ కోసం రైతుసేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి



క్రీడాకారిణులతో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), అక్టోబరు 9 : రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన బాలబాలికలను కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు కృష్ణా జిల్లాలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో విజేతలను బుధవారం తన ఛాంబర్‌లో కలెక్టర్ అభినందించారు. వారికి జ్ఞాపికలు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, డీఈవో శేఖర్, కోచ్ ఉదయ్, డీఎస్ఏ కోచ్‌లు సుమతి, వినోద్, మహజీజ్, ప్రేమనాథ్ పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై కల్యాణ వెంకన్న విహారం



తిరుపతిరూరల్, అక్టోబరు 9: తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు హనుమంత వాహనంపై శ్రీరాముడి అవతారంలో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం హనుమంత వాహనంపై, రాత్రి గజవాహనంపై ఊరేగి భక్తులకు అభయప్రదానం చేశారు. చంద్రగిరి మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు సారె సమర్పించి, మొక్కు చెల్లించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ వ్యవస్థాపకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల వితరణ



తిరుపతి అర్బన్, అక్టోబరు 9: సోషియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక యూత్ హాస్టల్లో 75మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. సిర్డ్ సంస్థ ఆధ్వర్యంలో అక్షర యజ్ఞం పేరిట నిర్వహిస్తున్న సాయంత్రం బడుల్లో తిరుపతి రూరల్, రేణిగుంట, ఏర్పేడు, చంద్రగిరి మురికివాడలకు చెందిన 75మంది పిల్లలు చదువుతున్నారు. వీరి సౌకర్యార్థం దాతల సాయంతో సైకిళ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ పేద పిల్లలకు సైకిళ్ల పంపిణీ అభినందనీయమన్నారు. టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి, ఎస్పీఎఫ్ కమాండెంట్ డి.ఎస్.కె.రాజు, బాలోత్సవం అధ్యక్షుడు నడ్డి నారాయణ, సిర్డ్ కార్యదర్శి హేమశేఖర్, జ్ఞానశేఖర్‌రెడ్డి, మునిలక్ష్మి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాజారెడ్డికి ఆరణి పరామర్శ



తిరుపతి అర్బన్, అక్టోబరు 9: జనసేన పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డిని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. రాజారెడ్డి అనారోగ్యంతో మూడు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేత పులిగోరు మురళి, నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మలబార్‌లో మైన్ డైమండ్ షో

తిరుపతి అర్బన్, అక్టోబరు 9: మలబార్ గోల్డ్ తిరుపతి శాఖలో మైన్ డైమండ్ ప్రదర్శన ప్రారంభించినట్లు షోరూం ఇన్‌చార్జ్ రిజీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ హారాలు, ప్లాటినం ఆభరణాల సముదాయం ఈ ప్రదర్శనలో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 వరకు ఉండే ఈ ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీడీవోకు సన్మానం



భాకరాపేట, అక్టోబరు 9: చిన్నగొట్టిగల్లు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన గిడ్డయ్యను కూటమి నాయకులు బుధవారం సత్కరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులకందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, సర్పంచ్ నాగచంగమనాయుడు, లోకనాథం, రాజశేఖర్, ఆసనాపురం మణి, యశ్వంత్, నాగిరెడ్డి, చిట్టిబాబు, సురేశ్, రఫీ, రెడ్డిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



భాకరాపేట, అక్టోబరు 9: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి కోరారు. చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ఘనజీవామృతం, ద్రవ జీవామృతం తయారీ, పిచికారీ విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సరస్వతి, ఉప సర్పంచ్ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రామకృష్ణాశ్రమంలో దసరా వేడుకలు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 9: తిరుపతి రామకృష్ణామఠంలో గురువారం నుంచి నాలుగు రోజులు దుర్గాపూజలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి స్వామి సుకృతానంద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం దేవీమహత్యం, లలితాసహస్రనామ పారాయణం, సరస్వతీ అష్టోత్తరం, విష్ణుసహస్రనామ పారాయణం, కుంకుమ పూజ చేస్తామని తెలిపారు. 13న విజయదశమి రోజున ఉదయం విజయదశమి పూజ, సాయంత్రం ఆరాత్రికం, శాంతిజపం జరుగుతాయని పేర్కొన్నారు.

ఎంపీడీవోకు అభినందన



తిరుపతిరూరల్, అక్టోబరు 9: తిరుపతి రూరల్ మండల ఎంపీడీవోగా నియమితులైన కె.రామచంద్రను బుధవారం సి.మల్లవరం గ్రామపంచాయతీ టీడీపీ ఇన్‌చార్జి మనోహర్ చౌదరి నేతృత్వంలో పలువురు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. పాతకాల్వకు చెందిన శివారెడ్డి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో దసరా వేడుకలు

తిరుచానూరు, అక్టోబరు 9: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఏవో ఖాదరవల్లి తెలిపారు. గురువారం దుర్గా బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, 11న హిమబిందు బృందం సంగీత కచేరి, దాండియా నృత్య ప్రదర్శన, 12న నెల్లూరుకు చెందిన కోటి, తిరుపతికి చెందిన రజనీ బృందాల సినీ, శాస్త్రీయ నృత్యం, కామెడీ స్కిట్, 13న తిరుపతికి చెందిన సంధ్య బృందం భరతనాట్యం, జానపద నృత్యాలు ఉంటాయని పేర్కొన్నారు. గేమ్స్, బోటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సరస్వతీదేవిగా మూలస్థాన ఎల్లమ్మ




తిరుపతిరూరల్, అక్టోబరు 8: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెంచువారి కాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని, అన్నదాన సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బిరుదాల కృష్ణారెడ్డి, బిరుదాల హనుమంతరెడ్డి, ఉభయదారులు టి.తేజస్వరూప్‌రెడ్డి, బి.మౌనిక, కరాన్ష్ పాల్గొన్నారు.

● **సరస్వతీదేవి అలంకరణలో చాముండేశ్వరి :** తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు.

సరస్వతిదేవి అలంకారంలో దుర్గాదేవి



రామచంద్రాపురం, అక్టోబరు 9: సూరావారిపల్లె సురభి గోశాల ఆవరణలో వెలసిన దుర్గాదేవి బుధవారం సరస్వతిదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శ్రీశక్తిపీఠంలో వెలసిన మరకతశక్తికాళీ అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. రాయలచెరువు కట్ట జలకంఠేశ్వరస్వామి ఆలయంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారు, భవానీ అమ్మవారు సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు.

సరస్వతీదేవిగా గంగమ్మ



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 9: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో జయకుమార్ పాల్గొన్నారు.

కపిలతీర్థంలో..

కపిలేశ్వరాలయంలో బుధవారం ఉదయం యాగశాల పూజ, కామాక్షి, కపిలేశ్వరులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని దుర్గాదేవి అలంకరణలో ఊంజలసేవ నిర్వహించారు.

అన్నపూర్ణేశ్వరిదేవిగా బొంతాలమ్మ



తిరుపతి (జీవకోన), అక్టోబరు 9: కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సరస్వతీదేవిగా అన్నపూర్ణదేవి



తిరుపతి అర్బన్, అక్టోబరు 9: దేవీనవరాత్రి ఉత్సవాలలో భాగంగా లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో బుధవారం రాత్రి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నివేదన సమర్పించారు.

సరస్వతిదేవిగా తిరుపతి గంగమ్మ



భాకరాపేట, అక్టోబరు 9: చిన్నగొట్టిగల్లు చెరుకు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగన్నగారిగడ్డ పంచాయతీ తొగటపల్లెలో వెలసిన జ్యోతీ చౌడేశ్వరి దేవికి అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

తల్లిదండ్రుల కలలకనుగుణంగా చదవాలి



పూజా కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9: తల్లిదండ్రుల కలలను నెరవేర్చడమేగాక యూనివర్సిటీకి మంచిపేరు తీసుకు వచ్చేలా విద్యార్థులు చదవాలని, చదువుల తల్లి సరస్వతీదేవి కరుణా కటాక్షాలు వారిపై ప్రసరించాలని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆకాంక్షించారు. యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో బుధవారం నిర్వహించిన సరస్వతి పూజలో వారు పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం ఎన్నో విలువైన గ్రంథాలకు నెలవన్నారు. కాలానుగుణంగా గ్రంథాలయంలో సాంకేతికతను అమలు చేస్తున్నామన్నారు. వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్ర నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమలోని మేథో సంపత్తిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. గ్రంథాలయ ఆవరణలో నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది.

అవగాహనతో క్యాన్సర్‌ను జయించొచ్చు



మాట్లాడుతున్న ప్రశాంత్

తిరుపతి రూరల్, అక్టోబరు 9: ముందస్తు అవగాహన కలిగి ఉండడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని సులువుగా జయించవచ్చని శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్(స్విమ్స్‌కార్) డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పెనుమాడు తెలిపారు. ఎస్వీ వ్యవసాయ కళాశాలలో టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా సదస్సు, ఉచిత స్క్రీనింగ్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందికి క్యాన్సర్ రకాలు, వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల క్యాన్సర్ బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారని, సరైన అవగాహన లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. కళాశాల ఏడీ డాక్టర్ ఎంవీ రమణ, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ రమేష్‌బాబు, ప్రోగ్రాం మేనేజర్ హేమంత్‌కుమార్, డాక్టర్ వెంకయ్యబాబు, మెహతాజ్, మహేంద్ర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రెడ్డికుమారి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల లెక్చరర్‌కు లెఫ్టినెంట్ హోదా



ఈశ్వరబాబు

పాకాల, సెప్టెంబరు 9 : పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ కె.ఈశ్వరబాబుకు లెఫ్టినెంట్ హోదా దక్కింది. ఎన్‌సీసీ కేర్ టెకింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఆయన 75 రోజులుగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పొందారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో చూపిన ప్రతిభతో ఈ హోదా లభించింది. ముగింపు కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి కమాండెంట్ మేజర్ జనరల్ కపిల్ జీత్ సింగ్ రాథోడ్ సమక్షంలో ఈ హోదాను అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, సహ అధ్యాపకులు ఈశ్వరబాబును అభినందించారు.

మహిళల పేరుతో మద్యం షాపులకు దరఖాస్తులు



దరఖాస్తు చేస్తున్న మహిళలు

చంద్రగిరి, అక్టోబరు 9: అదృష్టం వరిస్తుందనే ఆశతో కొందరు మద్యం షాపుల కోసం భార్య పేరుతో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇద్దరు మహిళలు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. చంద్రగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి 17 షాపులకు గానూ బుధవారం సాయంత్రానికి 82 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ ఫణీంద్ర తెలిపారు. చంద్రగిరి మండలంలో 7 షాపులకు 46, పాకాల మండలం 5 షాపులకు 7, చిన్నగొట్టిగల్లు మండలం 3 షాపులకు 14, ఎర్రావారిపాళెం మండలం 2 షాపులకు 15 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

అమ్మవారికి కుంకుమార్చన



పూజలో పాల్గొన్న భక్తులు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 9: తిరుపతి వినాయకనగర్ ఆలయంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయకనగర్ క్వార్టర్స్‌కు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

రేణిగుంట, అక్టోబరు 9: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. బుధవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. గాజులమండ్యం పోలీసులు తెలిపిన వివరాలు... రేణిగుంట - పుత్తూరు రహదారి అత్తూరు కూడలి వద్ద సుమారు 55 సంవత్సరాల వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో కాంగ్రెస్ పటిష్టతకు సహకారం



మహేష్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి (వైద్యం), అక్టోబరు 9 : పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి కోరితే ఏపీలో కాంగ్రెస్ పటిష్టతకు తమవంతు సహకారం అందిస్తామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మన మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్లో తిరుపతి, చిత్తూరు కాంగ్రెస్ పార్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆయన్ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాల గురవంబాబు, తిరుపతి, చిత్తూరు నగర అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు, భాస్కర్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి చేసి నగలు, నగదు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9 : ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి నగలు, నగదు అపహరించిన ఘటన సంజయ్‌గాంధీ కాలనీలో మంగళశారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన సాయమ్మకు బిడ్డలు లేరు. చేతివృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమె మంగళవారం అర్ధరాత్రి వరకు మేల్కొని, తలుపులు వేయకుండా పడుకుంది. ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ముగ్గురు ఇంట్లోకి ప్రవేశించారు. ఒంటిపై ఉన్న నగలు, దాచుకున్న డబ్బు ఇవ్వకుంటే చంపేస్తామని ఆమెను బెదిరించారు. ససేమిరా అనడంతో ఆమెను కొట్టి, ఒంటిపై ఉన్న ఏడు సవర్ల బంగారు నగలు, బీరువాలో ఉన్న రూ.8 లక్షల డబ్బు తీసుకెళ్లారు. బుధవారం ఉదయం ఆమె ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దుండగుల కోసం గాలిస్తున్నట్లు క్రైం డీఎస్పీ రమణకుమార్ చెప్పారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



రాజమౌళి

తిరుమల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సీఎం సెక్రటరీ ఏవీ రాజమౌళి, తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, సినీ దర్శకుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



మహేష్ కుమార్ గౌడ్

అక్రమ కట్టడాలను తొలగించండి



ఆర్ఐకు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

భాకరాపేట, అక్టోబరు 9: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో అక్రమ కట్టడాలను తొలగించాలని ఆర్ఐ శ్రీనివాసులుకు కూటమి నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ సర్వే నెం.329, 341, 342, 368, 629, 630లలో అనుమతులు, డాక్యుమెంట్లు లేకుండా కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. కొందరి వద్ద నకిలీ డాక్యుమెంట్లు ఉన్నాయని, వాటిని రెవెన్యూ రికార్డులతో సరిచూడాలని అన్నారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లోకనాథం, దామోదర్, మణి, యశ్వంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నూతన అధికారులకు సన్మానం



సెక్రటరి జయశంకర్‌ను సన్మానిస్తున్న సప్తగిరి కాలనీ టీడీడీ నాయకులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 9: సప్తగిరికాలనీ పంచాయతీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన జయశంకర్, కరెంటు ఏఈ మోహన్, ఎంపీడీవో రామచంద్రయ్యలను గ్రామ కమిటీ, బూత్ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కాలనీలోని సమస్యలను విన్నవించి త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ బీసీసెల్ ఉపాధ్యక్షుడు సుబ్బుయాదవ్, సప్తగిరికాలనీ పంచాయతీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాబాషా, ఉపాధ్యక్షులు కేశవ, కార్యదర్శి గోపి, నాగభూషణం, మహిళా ఉపాధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, బూత్ ఇన్‌చార్జ్ చాణిక్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

రేణిగుంట, అక్టోబరు 9: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. బుధవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. గాజులమండ్యం పోలీసులు తెలిపిన వివరాలు... రేణిగుంట - పుత్తూరు రహదారి అత్తూరు కూడలి వద్ద సుమారు 55 సంవత్సరాల వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వరదయ్యపాళెం, అక్టోబరు 9: మండలంలోని శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెంగంబాకం వద్ద రోడ్డు బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు... డానియెల్ పరిశ్రమలో విధులు ముగించుకున్న మహిళా కార్మికులు తిరిగి ఇంటికి ఆటోలో బయలుదేరారు. చెంగంబాకం గ్రామానికి చెందిన కాటమ్మ ఆటో దిగుతుండగా అతివేగంగా వచ్చిన టెంపో ట్రావెలర్ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మత్తేరిమిట్ట పంచాయతీకి చెందిన సుజాతకు రెండు కాళ్లు విరగ్గా, మరో మహిళ అభిరామికి ఎడమకాలు సగం తెగింది. ఆటో డ్రైవర్ చిరంజీవి, కాటమ్మకు నడుంపై గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీసిటీలోని రామచంద్ర ఆస్పత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి సురక్ష ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. కాగా టెంపో ట్రావెలర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ప్రకృతి వ్యవసాయానికి ఆధునికత జోడించండి


చెరకు పంటపై క్షేత్రస్థాయిలో అవగాహన

కేవీబీపురం, అక్టోబరు 9: ఆధునిక పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయాధికారి మురళీ కృష్ణకుమార్ చెప్పారు. మండలంలోని మహదేవపురం, సుబ్రహ్మణ్యపురం, ఓళ్ళూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... వ్యవసాయాధికారుల సూచనలు పాటించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడితే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుధాకర్, పశువైద్యాధికారి మునిశేఖర్, ఇతర శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఒకే రకమైన విత్తనాలు వేయొద్దు

బుచ్చినాయుడుకండ్రిగ: వరి వేసే రైతులు ఒకే రకమైన విత్తనాలు కాకుండా ఇతర రకాలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి భారతి తెలిపారు. కుక్కంబాకం, కంచనపుత్తూరుల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వరిలో తెగుళ్ల నివారణకు అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు వినియోగించ వద్దని సూచించారు. వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే వాడాలన్నారు.

అమ్మవారి వేషధారణలో ఎండీపుత్తూరు సర్పంచ్



ఏర్పేడు, అక్టోబరు 9: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం జరిగిన గరుడ వాహన సేవలో ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు సర్పంచ్ మోహన ప్రియ అమ్మవారి వేషధారణలో అలరించారు. పలువురు ఆమెను అభినందించారు.

పుత్తూరు వార్తలు

ఎంపీడీవోగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



పుత్తూరు టౌన్, అక్టోబర్ 9: పుత్తూరు ఎంపీడీవోగా రమేష్ బాబు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవో విధులు నిర్వహిస్తుండిన ఇందిరమ్మ రామచంద్రాపురానికి బదిలీ అయ్యారు. రేణిగుంటలో విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబు బదిలీపై పుత్తూరుకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

మున్సిపల్ సర్వేయర్‌గా వెంకటరమణ



పుత్తూరు అర్బన్, అక్టోబరు 9: పుత్తూరు మున్సిపాలిటీ సర్వేయర్‌గా వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై పుత్తూరు మున్సిపాలిటీకి వచ్చారు. గత రెండు సంవత్సరాలుగా సర్వేయర్ లేకుండా సాగిపోయింది. గతంలో సర్వే ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం సర్వేయర్ రాకతో మున్సిపల్ పరిధిలో సర్వే సమస్యలు అధిగమించే అవకాశం ఉంది. మర్యాదపూర్వకంగా కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను కలిశారు.

సరస్వతీదేవి అలంకరణలో ద్రౌపది దేవి


సరస్వతీదేవి అలంకరణలో ద్రౌపది దేవి, వాసవీ దేవి

పుత్తూరు టౌన్/ వడమాలపేట, అక్టోబరు 9: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. రాచపాలెంలో ఉన్న లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూల నక్షత్రం సందర్భంగా వడమాలపేట పట్టణంలోని కన్యకాపరమేశ్వరిని సరస్వతి దేవి రూపంలో అలంకరించారు. సాయంత్రం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మంగళ హారతులిచ్చారు.

హడలెత్తించిన చెరకు ట్రాక్టర్



పుత్తూరు అర్బన్, అక్టోబరు 9: పట్టణంలో పరిమితికి మించి చెరకు లోడ్ ట్రాక్టర్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. బుధవారం ఉదయం 11.40 గంటల ప్రాంతంలో పుత్తూరు - చిత్తూరు రహదారి రద్దీగా ఉంది. ఈ క్రమంలో ఎస్ఆర్‌పురం సమీపంలోని షుగర్ ఫ్యాక్టరీకి తరలించడానికి అధిక లోడ్‌లో ట్రాక్టర్ ముందు టైర్లు పైకి లేచినట్టు ప్రయాణించడంతో స్థానికులు బిత్తరపోయారు. ఎక్కడ వాహనం బోల్తా కొడుతుందోనని భయభ్రాంతులకు గురయ్యారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కరుణించు జ్ఞానప్రదాయిని



రక్తబీజాక్షరిగా జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తి - కాళరాత్రిగా బొమ్మలకొలువులోని అమ్మవారు - సరస్వతి దేవి అలంకారంలో దక్షిణ కాళికాదేవి, చాముండేశ్వరి, ముక్కంటి ఆలయంలోని కనకదుర్గమ్మ, కనకాచలం కనకదుర్గమ్మ ఉత్సవమూర్తి , పొన్నాలమ్మ, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి

శ్రీకాళహస్తి, అక్టోబరు 9: కరుణించు జ్ఞాన ప్రదాయిని అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి అమ్మ వార్లను దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తిని రక్తబీజాక్షరి బండాసురవధ అలంకారంలో అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఆలయంలో రంగుల గోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలోని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి అమ్మవారు శ్రీకాళరాత్రిగా కొలువుదీరారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ మహాసరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ఉత్సవమూర్తిని సరస్వతిదేవిగా అలంకరించారు. శ్రీకాళహస్తి మండలం వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికా దేవి సరస్వతిదేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి స్వర్ణ సరస్వతిగా భక్తులను కటాక్షించారు. ముత్యాలమ్మ, బహదూరుపేట కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు కూడా సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. బంగారమ్మ అమ్మవారు, పానగల్‌లో వెలసిన గంగమ్మ ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు, పానగల్ పొన్నాలమ్మ, బీపీ అగ్రహారం పెద్దగంగమ్మ, చిన్న గంగమ్మ అమ్మవార్లు సరస్వతిదేవిగా భక్తులపై వరాలు కురిపించారు. తెట్టు నల్లగంగమ్మ, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసల వీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంత మైదానం అంకాళమ్మ, వీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.


సరస్వతిదేవిగా బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, ముత్యాలమ్మ అమ్మవారు, బహదూరుపేట కన్యకాపరమేశ్వరి

వైభవంగా దసరా మహోత్సవాలు


సరస్వతిదేవి అలంకరణలో చిందేపల్లె, మర్రిమందలోని ఆలయాల్లోని పార్వతిదేవి - మీనాక్షి దేవిగా అవనాక్షమ్మ సాక్షాత్కారం - సరస్వతి దేవి అలంకరణలో అంబూరు కామాక్షమ్మ

ఏర్పేడు, అక్టోబరు 9: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో కొలువై ఉన్న ఆనందవల్లి అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిందేపల్లిలోని పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 7వ రోజు బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను కటాక్షించారు. ధర్మకర్త గిరిధర్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా మర్రి మందలో కొలువై ఉన్న పార్వతీదేవి సరస్వతిగా భక్తులను కటాక్షించారు.

మీనాక్షి దేవిగా అవనాక్షమ్మ

నారాయణవనం: మండలంలోని సముదాయంలో కొలువై ఉన్న టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు అవనాక్షమ్మను మీనాక్షి దేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఊంజల సేవ నిర్వహంచి, ఆలయ ప్రాంగణంలో తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. అలాగే కైలాసనాథ కోనలో కొలువైఉన్న కామాక్షి దేవిని సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తిరువట్యం మూలస్థాన ఎలమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు.

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో కొలువై ఉన్న కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు నందకిషోర్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహాకుంభాభిషేకానికి విరాళం



శ్రీకాళహస్తి, అక్టోబరు 9: ఏర్పేడు మండలంలోని అముడూరులో అంకమ్మ, పోతురాజు ఆలయ మహాకుంభాభిషేకానికి బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత రూ.5వేల అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ఆమెను కుంభాభిషేకానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హరియాణాలో హ్యాట్రిక్ విజయం చారిత్రాత్మకం



శ్రీకాళహస్తి, అక్టోబరు 9: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం చారిత్రాత్మకమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న సుపరిపాలనకు నిదర్శనమే ఈ ఫలితాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, జి.రమేష్‌బాబు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స

వరదయపాళెం, అక్టోబరు 9: మండలంలోని బత్తలవల్లంలో ఉన్న ఏకం ఆలయ ప్రాంగణంలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నారు. సిద్ధులు సంప్రదాయబద్ధంగా ఉపయోగించే కొన్ని అరుదైన మూలికల సారాన్ని కళ్లల్లో పూయడం వల్ల పలు వ్యాధులు నయమవుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు శిబిరం జరుగుతుంది.

మోత కూలీలకు దుస్తుల వితరణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 9: శ్రీకాళహస్తీశ్వరాల యంలో నిత్యం జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొనే 50 మంది కూలీలకు నాయుడుపేటకు చెందిన కె.సుబ్రమణి, సురేష్ కుటుంబ సభ్యులు పంచెలు, కండువాలను వితరణ చేశారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఏఈవో లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో పతకాలు సాధించాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు9: రాష్ట్రస్థాయి కుస్తీపోటీల్లో పతకాలు సాధించిన బాలబాలికలను అభినందిస్తూ జాతీయస్థాయిలో పతకాలు సాధించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కృష్ణ జిల్లా నున్నలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో విజేతలైన క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో నిర్వహించే పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

దుస్థితికి చేరుకుంటున్న తెలుగుగంగ భవనాలు


తలుపులు, కిటికీలు దెబ్బతిన్న గదులు - పిచ్చి మొక్కలతో ఉన్న భవనం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 9: మండల కేంద్రంలో లక్షలాది రూపాయిలు ఖర్చు చేసి నిర్మించిన తెలుగుగంగ భవనాలు నేడు దుస్థితిలో ఉన్నాయి. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగు గంగ కాలువ నిర్మాణం జరిగేటప్పుడు డీఈ స్థాయి అధికారి, సిబ్బంది నివాసాలు కొరకు భవనాలు నిర్మించారు. కాలువ నిర్మాణం వరకు ఈ భవనాల్లో పనిచేసే సిబ్బంది నివాసం ఉన్నారు. పనులు పూర్తియిన తరువాత పనిచేసే సిబ్బంది వేరే ప్రాంతాలకు బదిలీ కావడంతో ఈ భవనాలను అప్పట్లో పోలీస్‌స్టేషన్‌గా వినియోగించుకున్నారు. ఈక్రమంలో 2001లో పోలీసుస్టేషన్‌కు శాశ్వత భవనం నిర్మించడంతో భవనాలను బీసీ హాస్టల్‌గా ఉపయోగించారు. 2007లో హాస్టల్‌కూ శాశ్వత భవనాలు రావడంతో అప్పటి నుంచి ఎవ్వరికీ కేటాయించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయిలు వెచ్చించి నిర్మించిన భవనాలు నేడు దుస్థితికి చేరకున్నాయి. కొన్ని భవనాలకు తలుపులు, కిటికీలు కూడా పనికి రాకుండా పోయాయి. సంబంధిత అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తేవాల్సి ఉంది.



జనన శిశు యోజనపై అవగాహన


గర్భిణులకు వైద్య పరీక్షలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 9: తొట్టంబేడు మండలం కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాధవుడు, శివకుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రతి గర్భిణికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడమే కాకుండా పోషకాహారం, సురక్షితమైన కాన్పు, జనన శిశు యోజన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాలో సుజాత ప్రతిభ


ధృవీకరణపత్రంతో సుజాత

శ్రీకాళహస్తి, అక్టోబరు 9: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన శివప సాయి యోగా సెంటర్ నిర్వాహకురాలు సుజాత మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే త్వరలో జరగబోయే జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది.